సాక్షి
కాకినాడ

ఆదివారం । 6 । అక్టోబర్ । 2024



సంబరంగా..


సంబరం అంబరాన్ని తాకింది. రంగరాయ రారాజై వెలుగులీనింది. శనివారం కాకినాడ రంగరాయ వైద్య కళాశాల వార్షికోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. - 8లో



వ్యాన్‌ను ఢీకొని ఇద్దరి మృతి

గొల్లప్రోలు మండలం చెందుర్తి సెంటర్లో 216 జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. - 8లో


1.62 లక్షల క్యూసెక్కులు విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి శనివారం సాయంత్రం 1.62,276 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.90 అడుగులకు చేరింది. డెల్టా కాలువలకు 14,000 క్యూసెక్కుల నీటిని వదిలారు.

తమ్ముళ్లే సిండికేట్లు

- తెరపైకి మాజీ లిక్కర్ కింగ్‌లు
- దరఖాస్తు చేయవద్దంటూ బెదిరింపులు
- తునిలో తమ్ముళ్ల బరితెగింపు
- కాకినాడ సిటీలో ఫ్యామిలీ వార్
- రూరల్‌లో మాజీ మంత్రి సోదరుడు.. ప్రత్తిపాడు పెత్తనం కీలక నేత చేతుల్లో..



సాక్షి ప్రతినిధి, కాకినాడ: మద్యం దుకాణాలు ఎగరేసుపోయేందుకు లిక్కర్ సిండికేట్ కాచుక్కూర్చుంది. స్వయంగా నియోజకవర్గాల ప్రజాప్రతినిధులు, అనుచరగణం కూటమేతర పార్టీల సానుభూతిపరులకు బెదిరింపు ఫోన్లు చేస్తున్నారు. తమను కాదని టెండర్లు వేసి దుకాణాలు దక్కించుకున్నా ఎలా నిర్వహిస్తారో చూస్తామని బెదిరింపులకు దిగుతున్నారు. టెండర్ల దశలోనే వారిని కట్టడి చేయడానికి నేరుగా ఫోన్లు చేసి బెదిరిస్తున్నారు. ఎక్సైజ్ పోలీసులను దుకాణాల వద్ద కూర్చోబెట్టి వ్యాపారం జరగనీయబోమని ఫోన్లలో బెదిరింపులకు దిగుతున్నారు. తుని నియోజకవర్గంలో టీడీపీ సీనియర్ నేత అనుచరులు గడచిన మూడు రోజులుగా దరఖాస్తులు వేయవద్దని ప్రత్యర్థి పార్టీ నేతలకు ఫోన్ కాల్స్ చేస్తున్నారు. దాదాపు ఇదే వాతావరణం పెద్దాపురం, పిఠాపురం, కాకినాడ సిటీ నియోజకవర్గాల్లోనూ కనిపిస్తోంది. దరఖాస్తులు దాఖలు కాకుండా అడ్డుకోవాలనే వ్యూహం బెడిసికొడితే ప్రతి సిండికేట్ వ్యాపారంలో 20 శాతం కప్పం కట్టాల్సిందేనని షరతు పెడుతున్నారని తెలియవచ్చింది. జిల్లా వ్యాప్తంగా నోటిఫై చేసిన దుకాణాల కోసం వచ్చే దరఖాస్తుదారులను తెలుగు తమ్ముళ్లు నయానా, భయాన దారిలోకి తెచ్చుకుంటున్నారు. ప్రత్యర్థులు దాఖలుచేసే దరఖాస్తులతో పాటు షాపుల వారీగా తమ అనుచరగణంతో కూడా దరఖాస్తులు దాఖలు చేయిస్తున్నారు. దరఖాస్తుచేసుకునే వారి సంఖ్య తగ్గి ఆదాయం పడిపోకూడదని అధిష్టానం నుంచి వచ్చిన ఆదేశాలతో తెలుగు తమ్ముళ్లు దరఖాస్తులతో దూకుడు పెంచారు.

గత తేదేపా ప్రభుత్వంలో చక్రం తిప్పిన లిక్కర్ సిండికేట్లు మళ్లీ తెరపైకి వచ్చారు. వివిధ వ్యాపారాల్లో ఉన్న మాజీ సిండికేట్లు రంగంలోకి దిగి కొత్త వారిని చేర్చుకుని సిండికేట్ కడుతున్నారు. తెలుగుదేశం పార్టీకి చెందిన ఒక మాజీ మంత్రి సోదరుడు కాకినాడ సిటీ, కాకినాడ రూరల్ నియోజకవర్గాల్లో అన్నీ తానై చక్రం తిప్పుతున్నారు. నియోజకవర్గ ప్రజాప్రతినిధుల కనుసన్నల్లోనే ఇదంతా జరుగుతోంది. ఒక సిండికేట్‌కు సగటున 25 దుకాణాలు తగ్గకుండా చేజిక్కించుకోవాలనేది వ్యూహంగా ఉంది. జిల్లాలో నోటిఫై చేసిన ఏడు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో కాకినాడ సౌత్, కాకినాడ నార్త్, ప్రత్తిపాడు, తుని, పెద్దాపురం స్టేషన్ల పరిధిలో దుకాణాలకు గట్టి పోటీ ఉండేటట్టు కనిపిస్తోంది. కానీ దరఖాస్తుల స్వీకరణ మొదలైన ఈ నెల ఒకటో తేదీ నుంచి శనివారం వరకు చూసుకుంటే జిల్లాలో నోటిఫై చేసిన 155 దుకాణాలకు కేవలం 21 దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. ఇది వరకు ఒక ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో దుకాణం ఎక్కడ ఏర్పాటు చేయాలనేది స్పష్టత ఉండేదంటున్నారు. ఈ సారి ఒక స్టేషన్ పరిధిలో ఎక్కడైనా దుకాణం ఏర్పాటు చేసుకోవచ్చుననే నిబంధన, డిపాజిట్ పెంచేయడం తదితర అంశాలతో దరఖాస్తు చేయడానికి కొందరు వ్యాపారులు వెనకడుగువేస్తున్నారు. కాకినాడ సిటీ, రూరల్‌లో రెండు స్టేషన్ల పరిధిలో దుకాణాల కోసం ఏర్పాటవుతున్న సిండికేట్‌లతో ఇద్దరు ప్రజాప్రతినిధుల కుటుంబ సభ్యులు మంతనాలు సాగిస్తున్నారు. ప్రతి సిండికేట్ వ్యాపారం మొత్తం నుంచి 25 శాతం కప్పం కేటాయించాల్సిందేనని హుకుం జారీచేశారని సిటీ సిండికేట్‌లో గుసగుసలు వినిపిస్తున్నాయి. ఈ కప్పం ఎవరికి చెందాలనే దానిపై తెలుగుదేశం పార్టీకి చెందిన ఒక ప్రజాప్రతినిధి అన్నదమ్ముల కుటుంబాల మధ్య వార్ నడుస్తోంది. ఆ దుకాణాలపై పెత్తనం తనదంటే తనదంటూ వారసులు రంగంలోకి దిగడంతోనే చిక్కంతా వచ్చిపడిందని సిండికేట్ సభ్యులు పేర్కొంటున్నారు. ఇటీవల సంబంధిత ప్రజాప్రతినిధి వద్ద వారు గోడు వెళ్లబోసుకున్నారని తెలియవచ్చింది. ఇదేదో తేల్చి చెబితేనే దరఖాస్తు దాఖలు చేస్తామని లేదంటే వేరే దుకాణాలు చూసుకుంటామని సిండికేట్ సభ్యులు తెగేసి చెప్పినట్టు సమాచారం. తునిలో రెండు రోజులుగా తెలుగు తమ్ముళ్లు మరీ బరితెగించి బయట వారిని ఎవరినీ దరఖాస్తు చేయకుండా కట్టడిచేసే పనిలో ఉన్నారు. ఈ నియోజకవర్గంలో ఏర్పాటయ్యే 22 దుకాణాలు తమ గుప్పెట్లో ఉండాలని ఇక్కడి తెలుగు తమ్ముళ్లతో ఏర్పాటైన సిండికేట్ పావులు కదుపుతోంది. ప్రత్తిపాడు నియోజకవర్గంలో అన్నీ తానై రాజకీయాలను శాసిస్తున్న ఒక నాయకుడి కనుసన్నల్లో సిండికేట్‌లో వారు మాత్రమే దరఖాస్తులు వేసేలా ఒప్పందాలు జరిగాయి. దరఖాస్తుల దాఖలకు గడువు మిగిలి ఉన్న నాలుగు రోజుల్లో తమ్ముళ్ల సిండికేట్ దందా ఎటు దారితీస్తుందో వేచి చూడాల్సిందే. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్లు జిల్లాలో కాకినాడ సౌత్, కాకినాడ నార్త్, పిఠాపురం, తాళ్లరేవు, పెద్దాపురం, ప్రత్తిపాడు, తునిలో ఉన్నాయి.

వార్షిక రుసుం వివరాలు ఇలా..

10 వేల జనాభా :	రూ.50 లక్షలు
10-50 వేల జనాభా :	రూ.55 లక్షలు
50 వేలు పైన జనాభా :	రూ.65 లక్షలు
5 లక్షల లోపు జనాభా :	రూ.85 లక్షలు

దరఖాస్తుల ప్రారంభం : 1.10.2024 నుంచి
చివరి తేదీ : 9.10.2024 సాయంత్రం 5 గంటలు
లాటరీ : 11.10.2024
(వివేకానంద హాల్, కాకినాడ కలెక్టరేట్)
వ్యాపారాలు ప్రారంభం : 12.10.2024

న్యూస్‌రీల్

జీజీహెచ్‌లో కంప్లైంట్ బాక్సుల ఏర్పాటు

కాకినాడ క్రైం: కాకినాడ జీజీహెచ్‌లో రోగులు, వారి బంధువుల ఫిర్యాదుల స్వీకరణ కోసం వివిధ వార్డుల ఆవరణల్లో కంప్లైంట్ బాక్సులు ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ మేరకు శనివారం రాత్రి ఒక ప్రకటన విడుదల చేశారు. రోగులు తమ సమస్యలతో పాటు, ఎవరైనా లంచాలు అడిగినా తమ ఫిర్యాదులను పెట్టెలో వేయవచ్చన్నారు. అలాగే మహాప్రస్థానం సేవలు కావలసిన వారు 98490 31316 నంబరుకు ఫోన్ చేసి సంప్రదించాలన్నారు.

కిక్కిరిసిన అప్పనపల్లి



స్వామివారి అన్న ప్రసాదం స్వీకరించేందుకు బారులు తీరిన భక్తులు

మామిడికుదురు: దసరా సెలవులు కావడంతో అప్పనపల్లి శ్రీబాల బాలాజీస్వామి ఆలయానికి శనివారం భారీగా భక్తులు తరలివచ్చారు. పవిత్ర వైనతేయ గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు స్వామివారి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. శ్రీదేవి, భూదేవి సమేతంగా కొలువు దీరిన శ్రీబాల బాలాజీ స్వామిని దర్శించుకున్నారు. స్వామివారికి ముడుపులు, మొక్కుబడులు చెల్లించారు. స్వామివారి సన్నిధిలో లక్ష్మీ నారాయణ హోమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయానికి వివిధ సేవల ద్వారా రూ.2.73 లక్షల ఆదాయం వచ్చిందని ఆలయ ఈఓ ఎం.సత్యనారాయణరాజు తెలిపారు. లడ్డూ ప్రసాదం, దర్శనం టిక్కెట్ల విక్రయం ద్వారా రూ.2.14 లక్షలు సమకూరారు. నిత్యాన్నదాన ట్రస్టుకు రూ. 59,299 విరాళాలు వచ్చాయి. 4,686 మంది భక్తులు స్వామి వారిని దర్శించుకోగా, 3,578 మంది స్వామివారి అన్న ప్రసాదం స్వీకరించారు.

సర్టిఫికెట్లు పోతే ఇలా చేయండి

అమలాపురం టౌన్: జిల్లాలో రెండు నెలల్లో కురిసిన వర్షాలు, సంభవించిన వరదలకు కొన్ని ప్రాంతాల ఇంటర్ విద్యార్థులు సర్టిఫికెట్లు పోగొట్టుకున్నట్లు ఇంటర్ విద్యా మండలి దృష్టికి వచ్చిందని డిస్ట్రిక్ట్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ (డీఐఈఓ) వనుము సోమశేఖర రావు తెలిపారు. అలాంటి విద్యార్థులు ఎవరైనా సర్టిఫికెట్లు పోగొట్టుకుంటే వారి ఆధా ర్ కార్డు నకలు, సంబంధిత సర్టిఫికెట్ నంబర్ తదితర వివరాలతో ఒక దరఖాస్తును డీఐఈఓ కు గాని లేదా ఇంటర్ బోర్డు ప్రాంతీయ విద్యా అధికారికి గాని సమర్పించాలని సూచించారు. ఇందుకు ఏ విధమైన రుసుము లేకుండా ఉచితంగా బాధిత విద్యార్థులకు డూప్లికేట్ సర్టిఫికెట్లు అందజేస్తారని ఇంటర్మీడియట్ విద్యా మండలి తెలిపిందని ఆయన వివరించారు.

బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో..



బతుకమ్మలతో సందడి చేస్తున్న యువతులు

ఐ.పోలవరం : పచ్చని కోనసీమలో బతుకమ్మ సంబరాలు అలరించాయి. బతుకమ్మ.. బతుకమ్మ ఉయ్యాలో.. బంగారు బతుకమ్మ ఉయ్యాలో అని పాడుతూ యువతులు సందడి చేశారు. ఐ.పోలవరం మండలం మురమళ్లలోని అప్పన్నచెరువు గట్టు వద్ద వేంచేసి ఉన్న విజయ దుర్గమ్మ దసరా మహోత్సవాల సందర్భంగా శనివారం రాత్రి బతుకమ్మలను అమ్మవారి వద్ద ఉంచి ఆడిపాడారు. సంప్రదాయ దుస్తుల్లో రంగుల బతుకమ్మలతో సందడి చేశారు.

గాయత్రీదేవిగా బాలాత్రిపుర సుందరి



సామర్లకోట పంచారామ క్షేత్రంలో బాలా త్రిపుర సుందరి దేవి శనివారం గాయత్రిదేవి స్వరూపంలో భక్తులకు దర్శనం ఇచ్చారు.

దివ్యాంగుల సామాజిక సాధికారతకు మోదీ కృషి

కేంద్ర మంత్రి బన్వారీలాల్ వర్మ



దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీలో ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు తదితరులు

కాకినాడ రూరల్: దివ్యాంగుల సామాజిక, సాంస్కృతిక, విద్యా, ఆర్థిక సాధికారతకు ప్రధాని మోదీ నేతృత్వంలో కృషి చేస్తున్నట్టు కేంద్ర సామాజిక న్యాయం సాధికార శాఖ మంత్రి బీఎల్ వర్మ పేర్కొన్నారు. సామాజిక్ అధికారిత శివిర్ కార్యక్రమంలో భాగంగా అలింకో సహకారంతో జిల్లాలోని దివ్యాంగులకు శనివారం ఉచిత ఉపకరణాల పంపిణీ చేశారు. సురేష్ నగర్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథులుగా కేంద్ర మంత్రితో పాటు, స్థానిక ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ వర్చువల్‌గా పాల్గొన్నారు. అలాగే ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కాకినాడ సిటీ, రూరల్ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు, శాసన సభ్యులు పంతం నానాజీ, జెడ్పీ సీఈవో వీవీవీఎస్.లక్ష్మణరావు, అలింకో ప్రతినిధులు డీజీఎం సంజయ్ సింగ్, ఆఫీసర్ రవిశంకర్ ముఖ్య అతిథులుగా హాజరై కాకినాడ పట్టణం, రూరల్ నియోజకవర్గాల్లో అర్హులైన దివ్యాంగులకు ఉచితంగా వివిధ రకాల ఉపకరణాలను పంపిణీ చేశారు. ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లాలోని 2878 మంది దివ్యాంగులకు ఉచితంగా ఉపకరణాలు ఇచ్చిన ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి వర్మలకు ధన్యవాదాలు తెలియజేశారు. కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ మాట్లాడుతూ నియోజకవర్గం నుంచి 231 మంది దివ్యాంగులకు 336 ఉపకరణాలు పంపిణీ చేసినట్టు పేర్కొన్నారు. జేసీ రాహుల్ మీనా మాట్లాడుతూ సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో దివ్యాంగులు ఎక్కువగా ఉపకరణాల కోసం దరఖాస్తులు చేసుకుంటుండడంతో ఈ మేరకు ప్రత్యేక శిబిరాలు నిర్వహించి ఉపకరణాలకు అవసరమైన వారిని గుర్తించినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీవో ఎస్.మల్లిబాబు, డిజెబుల్ వెల్ఫేర్ ఇన్చార్జి ఏడీ పి.నారాయణ మూర్తి, సెట్రాజ్ సీఈవో కాశీ విశ్వేశ్వరరావు, రూరల్ ఎంపీడీవో కె.స్వప్న, ఉమా మనోవికాస కేంద్ర ఎండీ ఎస్‌పీ రెడ్డి ఇతర అధికారులు పాల్గొన్నారు.

కార్తిక మాసోత్సవాలకు విస్తృత ఏర్పాట్లు

రత్నగిరి సిబ్బందితో ఈఓ సమీక్ష సమావేశం



అధికారులు, పురోహితులతో చర్చిస్తున్న ఈఓ రామచంద్రమోహన్

అన్నవరం: హరి హరాదుల భేదం లేకుండా అందరూ పూజలు చేసే రత్నగిరిపై వెలసిన వీర వేంకట సత్యనారాయణ స్వామివారి ఆలయానికి కార్తిక శోభ సంతరించుకోనుంది. కార్తిక మాసంలో సత్యదేవుని ఆలయానికి లక్షలాదిగా భక్తులు తరలిరానున్న నేపథ్యంలో చేయాల్సిన ఏర్పాట్లపై ఈఓ కె.రామచంద్రమోహన్ శనివారం సమీక్షించారు. భక్తులకు ఏ విధమైన ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలని ఆలయ అధికారులను ఆయన ఆదేశించారు. కార్తికమాసం ప్రారంభానికి ఇంకా 25 రోజుల సమయం ఉన్నందున విభాగాల వారీగా ప్రణాళికలు రూపొందించుకుని కార్యాచరణకు సంసిద్ధులై ఉండాలని ఆయన సూచించారు. ప్రధానంగా ఆలయ విభాగం, వ్రతాలు, వసతి గదుల కేటాయింపు, శానిటేషన్, సెక్యూరిటీ, ఇంజినీరింగ్ విభాగాల అధికారులు భక్తులకు ఎటువంటి ఇబ్బంది రాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్తికమాసంలో శనివారం, ఆది, సోమవారాలు, దశమి, ఏకాదశి, పౌర్ణిమ, క్షీరాబ్ధి ద్వాదశి, ఇతర పర్వదినాలలో ఆలయానికి వచ్చే భక్తుల సంఖ్య ఎక్కువగా ఉండే నేపథ్యంలో ఈ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

27 నుంచి సత్యదీక్షలు

స్వామివారి జన్మనక్షత్రం 'మఖ' సందర్భంగా ఈ నెల 27వ తేదీ నుంచి నవంబర్ 23వ తేదీ వరకు సత్య దీక్షలు నిర్వహించనున్నందున ఆ మేరకు విస్తృత ప్రచారం చేయాలని ఈఓ ఆదేశించారు. గత ఏడాదిలానే ఈ ఏడాది కూడా సత్యదీక్షల విజయవంతానికి చర్యలు తీసుకోవాలని ఈఓ ఆదేశించారు. సమావేశంలో వేదపండితులు గొల్లపల్లి ఘనపాఠీ, గంగాధరబట్ల గంగబాబు, ప్రధానార్చకుడు కోట సుబ్రహ్మణ్యశర్మ, కల్యాణ బ్రహ్మ, వ్రత పురోహిత సంఘం అధ్యక్షుడు చామర్తి కన్నబాబు, అసిస్టెంట్ కమిషనర్ రామ్మోహన రావు, ఈఈ రామకృష్ణ, ఏఈఓలు కొండలరావు, జగ్గారావు, భ్రమరాంబ, ఎల్ శ్రీనివాసరావు, డీఈలు రాంబాబు, ఉదయ్, వివిధ విభాగాల అధగికారులు పాల్గొన్నారు.

సత్యదేవుని దర్శించిన 40 వేల మంది భక్తులు

రత్నగిరి వాసుడు సత్యదేవుని ఆలయం శనివారం వేల సంఖ్యలో వచ్చిన భక్తులతో కిట కిటలాడింది. విద్యాసంస్థలకు దసరా సెలవులు కావడంతో పెద్ద సంఖ్యలో విద్యార్థులు, భక్తులు వచ్చి పూజలు చేసుకున్నారు. ఆలయ ప్రాంగణం, మంటపాలు భక్తులతో కిక్కిరిసాయి. సుమారు 40 వేల మంది భక్తులు స్వామివాని దర్శించగా స్వామివారి వ్రతాలు రెండు వేలు నిర్వహించారు. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.40 లక్షలు ఆదాయం సమకూరింది. స్వామివారి నిత్యాన్నదానపథకంలో ఐదు వేల మంది భక్తులకు అన్న ప్రసాదం స్వీకరించారు. అనంతరం సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారి ప్రాకారసేవ శనివారం కన్నుల పండువగా జరిగింది. ఉదయం పది గంటలకు తిరుచ్చి వాహనంపై దేవేరులతో సత్యదేవుడి ఉత్సవ మూర్తులను ప్రతిష్ఠించి ప్రాకారసేవ నిర్వహించారు.

మత్స్యకారుల జీవనోపాధి భద్రతకు ప్రాధాన్యం

కలెక్టర్ షణ్మోహన్



కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ షణ్మోహన్

కాకినాడ సిటీ: తీరప్రాంత నియంత్రణ 2019 నోటిఫికేషన్ ప్రకారం రూపొందించిన నూతన కోస్టల్ జోన్ మేనేజ్‌మెంట్ ప్రణాళికలో జిల్లా తీరప్రాంత పరిరక్షణ, అభివృద్ధితో పాటు స్థానిక మత్స్యకారుల జీవనోపాధి భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యత కల్పించినట్టు కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. శనివారం సాయంత్రం కలెక్టరేట్ విధాన గౌతమి సమావేశపు హాలులో ఏపీ కోస్టల్ జోన్ మేనేజ్‌మెంట్ అథారిటీ, చెన్నై నేషనల్ సెంటర్ ఫర్ సస్టైనబుల్ కోస్టల్ మేనేజ్‌మెంట్, జిల్లా కాలుష్య నియంత్రణ మండలి సంయుక్త ఆధ్వర్యంలో కాకినాడ జిల్లా తీరంలోని గ్రామాల ప్రజలతో కోస్టల్ జోన్ మేనేజ్‌మెంట్ ప్రణాళికపై ప్రజాభిప్రాయ సేకరణపై నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు. కార్యక్రమంలో నూతన కోస్టల్ జోన్ మేనేజ్‌మెంట్ ప్లాన్ ముసాయిదాను సభికులకు వివరించి వారి అభిప్రాయాలను కలెక్టర్ సేకరించారు. సీఆర్‌జెడ్ నోటిఫికేషన్-2011తో పోల్చితే 2019 నోటిఫికేషన్‌లో స్థానిక పరిస్థితులను పరిగణలోకి తీసుకుని మరింత వెసులుబాటు కల్పించారన్నారు. తీర గ్రామాల్లో నివశించే ప్రజలు మత్స్యకారుల జీవనోపాధికి సీఆర్‌జెడ్ నిబంధనల వల్ల ఎటువంటి అవరోధాలు ఉండబోవన్నారు. అలాగే సముద్రంలో కలిసే క్రీక్‌లలో కూడా రెగ్యులేషన్ జోన్ పరిధిని ఇరువైపులా 50 మీటర్లకు కుదించారన్నారు. మడ అడవులను ఆనుకుని ఉన్న ప్రాంతంలో బఫర్ జోన్ నియమాలను కూడా సవరించినట్టు తెలిపారు. ముసాయిదాపై సమావేశానికి హాజరైన ప్రజల అభిప్రాయాలను స్వీకరించి ఇంకా ఎవరైనా తమ అభిప్రాయాలను చెప్పాలనుకుంటే 12వ తేదీ వరకు లిఖిత పూర్వకంగా తమకు సమర్పించవచ్చని కలెక్టర్ వివరించారు. కార్యక్రమంలో ఏపీ కోస్టల్ జోన్ మేనేజ్‌మెంట్ అథారిటీ, విజయవాడ ఈఈ మీరా సుభాన్ షేక్, శాస్త్రవేత్తలు సౌందరరాజన్, మాణిక్ మహాపాత్ర, జిల్లా పీసీబీ ఈఈ ఎంబీఎస్ శంకరరావు స్క్రీన్ ప్రజెంటేషన్ ద్వారా కోస్టల్ జోన్ మేనేజ్‌మెంట్ ప్లాన్‌లోని అంశాలను వివరించారు. అనంతరం పలువురు గ్రామస్తులు ఉప్పాడ వద్ద కోతకు గురౌతున్న తీరం, తీరంలో ఏర్పాటవుతున్న పరిశ్రమల వల్ల ఎదురుకాబోయే సమస్యలను వివరించారు. ముసాయిదా ప్రణాళికపై వచ్చిన అభిప్రాయాలను ఏపీ సీజెడ్‌ఎంఏకు నివేదించనున్నట్లు కలెక్టర్ వివరించారు.

ఇది ముంచే ప్రభుత్వం!

- నాలుగు నెలల పాలనలో అన్నింటా వైఫల్యం
- అందనంత ఎత్తులో నిత్యావసర సరకులు
- ఇసుక కొరతతో కార్మికుల పస్తులు
- డైవర్షన్ పాలిటిక్స్‌తో పబ్బం గడుపుతున్న వైనం
- జగన్‌ను తగ్గించేందుకు లడ్డూ డ్రామా
- సిట్ ఏర్పాటుతో వాస్తవాల వెల్లడి
- మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు కన్నబాబు



కాకినాడ రూరల్: ఇది మంచి ప్రభుత్వం కాదు.. ముంచే ప్రభుత్వమని, నాలుగు నెలల పాలనలో అన్నింటా వైఫల్యం చెందిందని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు కురసాల కన్నబాబు పేర్కొన్నారు. కాకినాడ వైద్య నగర్ క్యాంపు కార్యాలయంలో శనివారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో నిత్యావసర సరకులు విపరీతంగా పెరిగిపోయాయని, ఇసుక లేక భవన నిర్మాణ కార్మికులు పస్తులుంటున్నారని, స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ బెంగతో 4 వేల మంది కార్మికులు రోడ్డెక్కారని కన్నబాబు ధ్వజమెత్తారు. ఆ అంశాలను పక్కన పెట్టి ప్రభుత్వం డైవర్షన్ పాలిటిక్స్‌తో పబ్బం గడుపుతోందని ఆయన దుయ్యబట్టారు. కలియుగ దైవం వెంకటేశ్వరస్వామిని రాజకీయాల్లోకి లాగి కూటమి ప్రభుత్వం రాజకీయం చేస్తోందన్నారు. తిరుమల లడ్డూ తయారీలో వినియోగించే నెయ్యిలో కల్తీ జరిగిందని సాక్షాత్తు సీఎం స్వయంగా దుష్ప్రచారానికి తెరతీసి దుమారం సృష్టించారని, దీంతో ప్రపంచ వ్యాప్తంగా హిందువులు, వేంకటేశ్వర స్వామి భక్తుల మనోభావాలు దెబ్బతిన్నాయని ఆయన పేర్కొన్నారు. చంద్రబాబు చెబుతున్నది నిజమైతే ఈ ప్రభుత్వం ఏర్పడిన తరువాతే జూలైలో సంఘటన జరిగితే దానిని గత ప్రభుత్వానికి, పూర్వ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి ఆపాదించేందుకు రచ్చ చేస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వేసిన సిట్‌ను పక్కన పెట్టి సుప్రీం కోర్టు సీబీఐ డైరెక్టర్‌తో ఒక స్వతంత్ర విచారణ వ్యవస్థను నియమించడం వల్ల నిజాలు నిగ్గుతేలతాయని కురసాల పేర్కొన్నారు. అయినప్పటికీ టీడీపీ శ్రేణులు, చంద్రబాబు, వారితో కలిసి ప్రయాణిస్తున్న వారు దుష్ప్రచారాన్ని ఆపడం లేదన్నారు. దుర్మార్గమైన అబద్ధాలు చెప్తూ జగన్‌మోహన్ రెడ్డిని కించపరుస్తున్నాం, తగ్గిస్తున్నామనుకుంటూ పరోక్షంగా వేంకటేశ్వరుని ఖ్యాతిని తగ్గిస్తున్నారని గ్రహించలేకపోతున్నారన్నారు. ఒక పక్క ఎన్‌డీడీబీ నివేదికపై కూడా తాము ఇచ్చింది పూర్తిగా నమ్మడానికి లేదని వాళ్లే చెప్పారని, మధురై కోర్టు ఈ మధ్యనే తీర్పు కూడా చెప్పిందన్నారు. ఒకే శాంపిల్‌ను కిమ్స్ ల్యాబ్ చెన్నైలోను, మరో ల్యాబ్‌లోను టెస్ట్ చేయిస్తే రెండు వేర్వేరు నివేదికలు ఎలా వచ్చాయని, ఒక చోట కల్తీ జరిగిందని, మరో చోట కల్తీ జరగలేదని ఎలా వచ్చిందన్నారు. కేంద్ర క్వాలిటీ కంట్రోల్ ఏజెన్సీ పరిశోధన ఫలితాలు ఎందుకు విడుదల చేయడం లేదన్నారు. సుప్రీంకోర్టు నియమించిన ఇద్దరు సీబీఐ అధికారులు, ఇద్దరు రాష్ట్ర ప్రభుత్వ అధికారులు, ఒకరు ఫుడ్ సేఫ్టీ అథారిటీ అధికారి కలిపి ఐదుగురు కమిటీగా ముందు వెళ్లాలని సుప్రీం చెప్పిందన్నారు. లడ్డూలో కల్తీ జరగలేదని టీటీడీ ఈఓ చెబుతున్నా మరొక దేవుడిని రాజకీయాల్లోకి లాగవద్దని, పొలిటికల్ డ్రామాలు వద్దని సుప్రీం చెప్పడంతో ఇకనైనా లడ్డూ రాజకీయాలు మానాలని, డైవర్షన్ పాలిటిక్స్‌కు తెరదించాలని కోరారు. రాష్ట్రంలో ప్రజా సమస్యలు గాలికి వదిలేశారన్నారు. ప్రజా సమస్యల పరిష్కార దిశగా అడుగులు వేయాలని కన్నబాబు ప్రభుత్వానికి సూచించారు. అతివృష్టి, అనావృష్టితో రాష్ట్రంలో కరవు పరిస్థితులు నెలకొన్నాయని, రాష్ట్రంలో అత్యాచారాలు, హత్యలు పెరిగిపోయాయన్నారు. పుంగనూరులో ఏడేళ్ల ముస్లిం బాలికను హత్య చేసినా ప్రభుత్వానికి చీమ కుట్టినట్టు లేదన్నారు. మంచి ప్రభుత్వం అని మనకు మనం బాజాలు వాయించుకుంటే నమ్మే పరిస్థితిలో ప్రజలు లేరన్నారు. తిరుమల లడ్డూ దుష్ప్రచారాన్ని తిప్పుకొడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజల పక్షాన వైఎస్సార్ సీపీ పోరాడుతుందన్నారు. ఉల్లి రేటు రైతు బజారులో కిలో రూ.60 ఉంటే బహిరంగ మార్కెట్‌లో రూ.75 పలుకుతోందని, బియ్యం 25 కిలోల మూటపై రూ.150 నుంచి రూ.200 వరకు పెరిగిందన్నారు. వంట నూనెలు, ఇతర నిత్యావసర సరకుల ధరలు విపరీతంగా పెరిగిపోయినా వాటివైపు ఈ ప్రభుత్వం కనీసం చూడడం లేదన్నారు. తమ ప్రభుత్వ హయాంలో పెరిగిన ధరలు తగ్గించేందుకు ధరల స్థిరీకరణ నిధులు వినియోగించుకునే వాళ్లమని, వైఎస్సార్ సీపీ అధికారంలో ఉన్నప్పుడు ఇసుకలో దారుణాలు జరిగిపోతున్నట్టు చిత్రీకరించారని, ఇప్పుడు ఇసుక అందుబాటులో లేక భవన నిర్మాణ కార్మికులు వీధిన పడుతున్నారన్నారు. సోషల్ మీడియాలో ఇసుకకు సంబంధించి వైరల్ అవుతున్న ఒక బిల్లును చూస్తే అందులో రూ.9,276 రవాణా చార్జీలుగాను మొత్తం విలువ రూ.16,640 చూపారన్నారు. రవాణా కాకుండా మిగిలినది ఏమిటని ప్రశ్నించారు. మిగిలిన బాపతు ఎవరికి వెళుతోందన్నారు. ఈ జిల్లాకు భద్రాచలం నుంచి, విశాఖకు ఒడిశా నుంచి ఇసుక వస్తుందని చెబుతున్నారన్నారు. లోడు ఇసుకకు రూ.10 వేలు నుంచి రూ.15 వేల భారం పడుతోందన్నారు. ఉచిత ఇసుక పేరు చెప్పి వినియోగదారులపై భారం వేస్తున్నారన్నారు. టీటీడీలో రివర్స్ టెండరింగ్ రద్దు చేసినట్టు శనివారం ఉదయం నుంచి ప్రచారం చేసుకుంటున్నారని, మొన్ననే కదా క్యాబినెట్ సమావేశంలో రివర్స్ టెండరింగ్ రద్దుపై తీర్మానం చేశారన్నారు. సెప్టెంబరులో రివర్స్ టెండరింగ్ లేకుండానే టీటీడీలో టెండర్లు ఆమోదించడం గమనార్హమన్నారు. తిరుమలలో గోవింద నామస్మరణ జరగాలని ముఖ్యమంత్రి అంటున్నా చంద్రబాబు నామస్మరణతో టీటీడీ అఫీషియల్ ఎక్స్‌లో పెట్టిన పోస్టింగులు చూపుతూ కన్నబాబు ధ్వజమెత్తారు. జగన్‌మోహన్ రెడ్డిని టార్గెట్ చేస్తూ ఎక్స్‌లో ప్రచారం చేస్తున్నారని, స్వామిపై భక్తి కన్నా ఏదో జరిగిపోయిందన్నట్టు చూపే ప్రయత్నం చేస్తున్నారని కురసాల వివరించారు.

రేపటి నుంచి జాతీయ తపాలా వారోత్సవాలు

రాజమహేంద్రవరం సిటీ: రాజమహేంద్రవరం తపాలా డివిజన్‌లో సోమవారం నుంచి 11వ తేదీ వరకు జాతీయ తపాలా వారోత్సవాలు నిర్వహిస్తున్నట్టు పోస్టల్ సూపరింటెండెంట్ కె.శేషారావు శనివారం ప్రకటించారు. ఈ వారోత్సవాలలో భాగంగా వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు ఆయన తెలిపారు. ఏడో తేదీన తపాలా పార్సెల్ సేవలలో వచ్చిన మార్పులు, విదేశాలకు పార్సెల్స్ పంపటానికి ప్రారంభించిన సేవలు , మరింత మెరుగైన ఉత్తరాల బట్వాడా కోసం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. 8న ఫిలాటలీ దినోత్సవం సందర్భంగా డాయి అఖర్ ఉత్తరాల పోటీ, క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. తొమ్మిదో తేదీన మాతృమూర్తి పేరున ఒక మొక్క అనే అంశంపై మొక్కలు నాటే కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. పదో తేదీన కవలగొయ్య, వెల్ల, పాట్టిలంక గ్రామాలు, ఆర్టీసీ బస్ కాంప్లెక్స్‌లలో ఆధార్ నమోదు, మార్పులకు ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తామన్నారు. 11వ తేదీన సామాన్య ప్రజలకు పొదుపు పథకాలు, తపాలా జీవిత బీమా పాలసీలు, ఐపీపీబీ సేవలపై అవగాహన కల్పించి, కొత్త ఖాతాలు ప్రారంభించే కార్యక్రమం చేస్తామని ఈ తపాలా సేవలను ప్రజలందరు వినియోగించుకోవాలని కోరారు.

క్లుప్తంగా

అగ్నిమాపక శాఖ ఉద్యోగుల సంఘ అధ్యక్షుడిగా సతీష్


ఏకగ్రీవంగా ఎన్నికైన నూతన కార్యవర్గం

కాకినాడ క్రైం: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అగ్నిమాపక శాఖ ఉద్యోగుల సంఘ అధ్యక్షుడిగా యాతం సతీష్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నిక య్యారు. శనివారం కాకినాడలో ప్రభుత్వ డ్రైవర్స్ అసోసియేషన్ బిల్డింగ్‌లో జరిగిన ఈ ఎన్నికలకు ఎన్నికల అధికారిగా బాలకృష్ణ, సహాయ ఎన్నికల అధికారులుగా గణేష్, సప్తగిరి, పి.వి.వి.స త్యనారాయణ వ్యవహరించారు. సంఘ ఉపాధ్యక్షుడిగా రామకృష్ణ దొర, కార్యదర్శిగా జి.వి.మోహన్, జాయింట్ సెక్రటరీగా ఆకుల నరేష్‌కుమార్, కోశాధికారిగా వి.సుబ్రహ్మణ్యం, సలహాదారుగా కె.మురళీకృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన కమిటీకి జిల్లా అగ్నిమా పక అధికారి వి.సుబ్బారావు అభినందనలు తెలి పారు. ఈ కార్యక్రమంలో సంఘ రాష్ట్ర అధ్యక్షుడు చంద్రశేఖర్, రాష్ట్ర నాయకులు కేఎస్ఎన్ మూర్తి, డీఎల్ నారాయణ పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణా
అడ్డుకున్న గ్రామస్తులు


సుభద్రపాలెంలో గ్రామస్తులు నిలుపుదల చేసిన ట్రాక్టర్లు

నల్లజర్ల: మండలంలోని సుభద్రపాలెం శివారులో ఉన్న ఎర్రకాలువ నుంచి శనివారం రాత్రి టీడీపీ నేతలు ఇసుక అక్రమ రవాణాకు తెరతీశారు. ఇది గమనించిన గ్రామస్తులు ఈ అక్రమ రవాణాను అడ్డుకున్నారు. గ్రామంలోకి వచ్చిన రెండు ఇసుక లోడు ట్రాక్టర్లను నిలుపుదల చేశారు. మిగతా ట్రాక్టర్లు వెనుతిరిగి వెళ్లిపోయాయి. ఇసుక అక్రమ రవాణా విషయాన్ని పోలీస్, రెవెన్యూ అధికారులకు తెలియజేసినా ఎవరూ స్పందించ లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఈ ఏడాది ఆగస్టులో ఎర్రకాలువకు వచ్చిన వరదలకు ఈ ప్రాంతంలో ఇసుక నిక్షేపాలు భారీగా వచ్చి చేరాయి. దీనిపై పోతవరం పరిసర ప్రాంతానికి చెందిన టీడీపీ నేతలు కన్నేశారు. ఇసుక ఎగుమ తికి స్థానికంగా ఉన్న ట్రాక్టర్లు, బంటా కూలీలు రాకపోవడంతో రాజవరం నుంచి తీసుకువచ్చి ఈ అక్రమ రవాణాకు తెరతీశారు. రాత్రి 9 దాటినా అధికారులు ఎవరూ స్పందించక పోవడంతో ఆ ట్రాక్టర్ల వద్ద గ్రామస్తులే పహారా కాస్తున్నారు.

సంబరంగా..

- మిన్నంటిన రంగరాయ వైద్య కళాశాల వార్షికోత్సవం
- తరలివచ్చిన అతిరథులు, పూర్వ విద్యార్థులు

కాకినాడ క్రైం: సంబరం అంబరాన్ని తాకింది. రంగరాయ రారాజై వెలుగులీనింది. శనివారం కాకినాడ రంగరాయ వైద్య కళాశాల వార్షికోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ప్రిన్సిపాల్ డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహం పర్యవేక్షణలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ విష్ణువర్ధన్ ఆధ్వర్యంలో ఈ కళాశాల 66వ వార్షికోత్సవాన్ని ఆద్యంతం కనుల పండువగా నిర్వహించారు. కాకినాడ రంగరాయ వైద్య కళాశాలది 66 ఏళ్ల అప్రతిహత యశస్సు అని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.విష్ణువర్ధన్ కొనియాడారు. ఎందరో వైద్య ప్రముఖులు, నేతలు, అధినేతలను దేశానికి అందించిన ఘనకీర్తి రంగరాయదని కీర్తించారు. 1958లో ఓ ప్రైవేట్ కళాశాలగా స్థాపించబడి, 1959లో జిల్లా ఆసుపత్రికి అనుసంధానం అయ్యిందన్నారు. 1977లో ప్రభుత్వ ఆధీనంలోకి వెళ్లిందన్నారు. 184 వైద్య కళాశాలల అనుబంధ డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ టాపర్‌గా రంగరాయ వైద్య కళాశాల విద్యార్థి డాక్టర్ ఎ.సాయి అనిరుథ్ నిలవడం గర్వకారణమని డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్, రాష్ట్ర డీఎంఈ, రంగరాయ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహం అన్నారు. యూనివర్సిటీ టాపర్‌గా నిలిచిన డాక్టర్ ఎ.సాయి అనిరుథ్ వివిధ విభాగాలలో ఐదు బంగారు పతకాలు, మరో నాలుగు అవార్డులు సాధించి రంగరాయ వైద్య కళాశాల కీర్తిని ఇనుమడింపజేశారని ఆర్ఎంసీ వైస్ ప్రిన్సిపాల్ అకడమిక్స్ డాక్టర్ డీపీవీఎస్ శశి అన్నారు. డాక్టర్ చంద్రాభట్ల పార్వతి 7 అవార్డులు సాధించి రెండో స్థానంలో నిలిచారన్నారు.

జాతీయ సదస్సులకు వేదిక

జాతీయ వైద్య విజ్ఞాన సదస్సులకు రంగరాయ వైద్య కళాశాల వేదికగా నిలిచిందని అవిఘ్న ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు డాక్టర్ ఉమామహేశ్వర రావు, డాక్టర్ కె.శైలజ అన్నారు. అనాటమీ విభాగం ప్రతిష్టాత్మక జర్నల్స్‌లో 7 పరిశోధనా పత్రాలు సమర్పించిందన్నారు. కార్యక్రమానికి అతిథులుగా డాక్టర్ నరసింహంతో పాటు జీజీహెచ్ సూపరింటెండెంట్ లావణ్యకుమారి, పాడేరు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ హేమలతాదేవి, విజయనగరం ప్రభుత్వ వైద్య కళాశాల కమ్యూనిటీ మెడిసిన్ ప్రొఫెసర్ బి.దేవి మాధవి, స్నేహ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రామస్వరూప్ జవహర్ హాజరయ్యారు. దేశానికి వైద్య ఉద్దండుల్ని అందించిన కళాశాల ఆర్ఎంసీ అని కీర్తించారు. డాక్టర్ నరసింహం చేతుల మీదుగా టాపర్లకు అవార్డులు ప్రదానం చేశారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.


టాపర్‌లకు పతకాలు అందిస్తున్న డాక్టర్ నరసింహం, అతిథులు

సమర్థ నిర్వహణతోనే ఘనత



డాక్టర్ విష్ణువర్ధన్ బృందం రంగరాయ కార్యకలాపాలను ఎంతో సమర్థవంతంగా నిర్వహిస్తున్నారు. కళాశాల నిర్వహణలో రాజీ లేని విధానం విద్యార్థుల భవితకు ఎంతో మేలు చేస్తుంది. విద్యతో పాటు సామాజిక బాధ్యత, రోగులతో మసలుకోవాల్సిన తీరు, పరిశోధన, పరిశీలన అంశాలపై విద్యార్థులను నిష్ణాతులుగా తీర్చిదిద్దుతున్నాం.

– నరసింహం, ఎన్టీఆర్ యూహెచ్ఎస్ వీసీ, ఏపీ డీఎంఈ, ఆర్ఎంసీ ప్రిన్సిపాల్

'రంగరాయ' ఓ బ్రాండ్



దేశ, విదేశాల వైద్య యవనికపై రంగరాయ ఓ తిరుగులేని బ్రాండ్. ఆర్ఎంసీలో చదువుకుని ఎన్నో ఉన్నత శిఖరాలు అధిరోహించిన వారున్నారు. దేశం దాటి విదేశాల్లో రంగరాయ కీర్తిని ఇనుమడింపజేసిన ఘనత వారిది. ప్రత్యేక బోధనా శైలి, బోధకుల అపార పరిజ్ఞానం రంగరాయ వైద్య విద్యకు మణిమకుటాలు.

– ఎ.విష్ణువర్ధన్, వైస్ ప్రిన్సిపాల్, ఆర్ఎంసీ, అవిఘ్న ఆర్గనైజింగ్ కమిటీ

నా విజయం రంగరాయదే



రంగరాయ వైద్య విద్యార్థిగా గర్విస్తున్నా. కళాశాల కేవలం విద్యనే కాదు సమాజంలో నడవడికను, వైద్య విద్య గొప్పతనాన్ని, విద్యను సమాజం కోసం వినియోగించాల్సిన ఆవశ్యకతను బోధించింది. నా విజయం కళాశాలది, గురువులది. యూనివర్సిటీ టాపర్‌గా, 9 అవార్డులు, 5 బంగారు పతకాల సాధకుడిగా కంటే రంగరాయన్‌గా నేను గర్విస్తున్నా.

– అనిరుథ్, ఆర్ఎంసీ విద్యార్థి, ఎన్టీఆర్ యూహెచ్ఎస్ టాపర్

కనకదుర్గమ్మ ఆలయంలో చోరీ


రోళ్లపాలెం కొబ్బరి తోటలో దొంగలు వదిలేసిన హుండీని పరిశీలిస్తున్న పోలీసులు

అమలాపురం టౌన్: రోళ్లపాలెంలోని బుడగ జంగాల కాలనీ వద్ద కనకదుర్గమ్మ ఆలయంలో శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత చోరీ జరిగింది. ఆలయంలోని హుండీని దొంగిలించి అందులోని కరెన్సీ నోట్లను తీసుకుని, చిల్లర నాణేలు, ఖాళీ హుండీని సమీప తోటలో వదిలేసి వెళ్లిపోయారు. అయితే హుండీపై రక్తపు మరకలు ఉండడంతో దానిని బద్దలు కొట్టే సమయంలో దొంగల చేతికి గాయమైనట్లు తెలుస్తోంది. శనివారం తెల్లవారుజామున కాలనీవాసులు శరన్నరాత్ర ఉత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజలు చేసేందుకు ఆలయం వద్దకు వచ్చేసరికి ఆలయం తలుపులు తెరిచి ఉండడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. పట్టణ పోలీసులు వచ్చి ఆలయాన్ని, హుండీ పడి ఉన్న ప్రాంతాన్ని పరిశీలించారు. క్లూస్ టీమ్ వచ్చి నిందితుల వేలి ముద్రలు, ఇతర ఆధారాలను సేకరించారు. సీఐ పి.వీరబాబు కేసును దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


సంఘటనా స్థలం వద్ద ఆనంద్ మృతదేహం

కె.గంగవరం: మండలంలోని కోట గ్రామ పరిధిలో ఏటిగట్టుపై ఉన్న వంతెన వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో కొజు ఆనంద్ (20) మృతి చెందాడు. ఎస్సై జానీబాషా కథనం ప్రకారం.. పశ్చిమగోదావరి జిల్లా కొవ్వూరు పట్టణంలోని కొత్తపేట వీధికి చెందిన కొజు ఆనంద్ తన స్నేహితుడితో కలసి శుక్రవారం సాయంత్రం మోటారు సైకిల్‌పై సరదాగా యానం వెళ్లారు. అనంతరం తిరిగి యానం ఏటిగట్టుపై నుంచి కొవ్వూరు వెళ్తుండగా కోట వద్ద వంతెన వద్దకు వచ్చేసరికి ఎస్ ఆకారంలో ఉన్న వంతెనను గమనించని వారు గోడను ఢీకొన్నారు. ఈ ఘటనలో మోటార్‌సైకిల్ నడుపుతున్న ఆనంద్ అక్కడికక్కడే మృతి చెందగా, వెనుక కూర్చున్న వ్యక్తి చిన్న గాయాలతో బయటపడ్డాడు. స్థానికుల సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహానికి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసును దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై జానీబాషా తెలిపారు.

స్వామిని చూడగ.. మది మురవగ


ఆలయం వద్ద ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు


ప్రత్యేక అలంకరణలో వాడపల్లి వేంకటేశ్వర స్వామి

భక్తులతో శోభిల్లిన వాడపల్లి క్షేత్రం

ఆత్రేయపురం: శ్రీనివాసా.. శ్రీవేంకటేశా అంటూ ఆ స్వామిని భక్తజనం కొలిచింది. కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన ఆత్రేయపురం మండలం వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయం శనివారం భక్తులతో శోభిల్లింది. స్వామివారిని వేద పండితులు, అర్చకులు ప్రత్యేకంగా అలంకరించారు. ఉదయం సుప్రభాత సేవ, నీరాజన మంత్రపుష్పం తదితర పూజాదికాలు చేశారు. ఏడు శనివారాల నోము ఆచరిస్తున్న భక్తులు ఏడు ప్రదక్షిణలు చేశారు. కోరిన కోర్కెలు తీరిన భక్తులు స్వామివారిని దర్శించుకునేందుకు కాలినడకన వచ్చారు. రాష్ట్రంలోని నలుమూలల నుంచి వేలాది మంది రావడంతో క్యూలైన్లు నిండిపోయాయి. గోవింద నామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. మధ్యాహ్నం నుంచి ఆలయ ఆవరణలో వేలాది మందికి అన్న సమారాధన నిర్వహించారు. దేవదాయ ధర్మదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, ఆలయ ఈఓ నల్లం చక్రధరరావు ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అలాగే పురాణ ప్రసిద్ధి చెందిన ర్యాలి జగన్మోహినీ కేశవ స్వామి ఆలయం, ఆత్రేయపురం లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులు పాల్గొని స్వామివార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆయా ఆలయాల వద్ద ఎస్సై రాము ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

నిత్య ఆరాధనతో అమ్మవారి అనుగ్రహం

- శ్రీపరిపూర్ణానంద స్వామి
- శ్రీపీఠంలో మహాశక్తి యాగం

కాకినాడ రూరల్: నిత్య ఆరాధనతో అమ్మవారి అనుగ్రహం పొందవచ్చని శ్రీపరిపూర్ణానంద స్వామి అన్నారు. రమణయ్యపేట శ్రీపీఠంలో మూడో రోజు మహాశక్తి యాగం ఘనంగా నిర్వహించారు. శనివారం నరదృష్టి పరిహారం కోసం లక్ష నిమ్మకాయల పూజ జరిగింది. అలాగే దేవీ సూక్త రాజమాతంగి దేవి హోమాన్ని వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ అత్యంత వైభవంగా నిర్వహించారు. మూడో రోజు శ్రీపీఠంలో ఐశ్వర్యంబికా అమ్మవారిని రాజమాతంగి దేవిగా అలంకరించారు. కుంకుమ పూజలో సుమారు 30 వేల మంది మహిళలు పాల్గొన్నారు. శ్రీవరసిద్ధి వినాయక గణపతి ప్రార్థనతో భక్తి సంగీత కార్యక్రమాన్ని ముందుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా పరిపూర్ణానంద స్వామి మాట్లాడుతూ అమ్మవారి అనుగ్రహం ఉంటేనే అన్నీ సాధ్యమవుతాయన్నారు. అమ్మవారిని ఆరాధన చేసేటప్పుడు మన ఎదుట ఆమె రూపమే ఉండాలన్నారు. రాజమాతంగి అమ్మవారిని అందరూ దర్శించుకోవాలని కోరారు. అయోధ్య నుంచి తీసుకువచ్చిన శ్రీరాముని బాణం, విల్లును పరిపూర్ణానంద స్వామి భక్తుల ముందు ప్రదర్శించారు. తొలుత ఆధ్యాత్మికవేత్త అనంతలక్ష్మి దివ్య సందేశాన్ని ఇచ్చారు. దుర్గా అవతారం గురించి పలు విశేషాలను చక్కగా వివరించారు. దుర్గారావు బృందంచే సౌందర్య లహరి పారాయణ సాగింది. పెద్ద సంఖ్యలో తరలి వచ్చిన భక్తులకు మధ్యాహ్నం అన్న ప్రసాద వితరణ జరిగింది.


అయోధ్య నుంచి తీసుకువచ్చిన శ్రీరాముని విల్లును ప్రదర్శిస్తున్న స్వామి పరిపూర్ణానంద


పూజలో పాల్గొన్న భక్తులు

గల్లంతయ్యాడనుకున్న వ్యక్తి ప్రత్యక్షం

అమలాపురం టౌన్: అమలాపురం అగ్నిమాపక సిబ్బంది స్థానిక ఎర్ర వంతెన నుంచి రూరల్ మండలం సమనస లాకుల వద్ద వరకూ కాలువ గట్ల వెంబడి గల్లంతైన వ్యక్తి కోసం శనివారం ఉదయం రెండు గంటల పాటు హైరానాతో గాలించారు. ఎర్ర వంతెన ప్రాంతానికి చెందిన ఎం.ఏడుకొండలు (50) కాలువలో ప్రమాదవశాత్తూ కాలు జారి పడి గల్లంతయ్యాడని అతని కుటుంబీకులు సమాచారం ఇవ్వడంతో అగ్ని ప్రమాద సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టారు. ఓ పక్క కుటుంబీకులు అతని కోసం ఆందోళన చెందుతున్నారు. మరోపక్క అగ్నిమాపక సిబ్బంది గాలింపు చర్యల్లో నిమగ్నమయ్యారు. ఇదంతా జరుగుతున్న ఉత్కంఠ వాతావరణంలో గల్లంతయ్యాడనుకుంటున్న ఏడుకొండలు ఉన్నపళంగా ప్రత్యక్ష కావడంతో అటు కుటుంబీకులు, ఇటు అగ్నిమాపక సిబ్బంది అవాక్కయ్యారు. తానెక్కడికో వెళ్లి వస్తున్నానని ఏడుకొండలు బదులివ్వడంతో పోనీలే కథ సుఖాంతం అయ్యిందని అందరూ ఆనందించారు.

వ్యక్తికి విద్యుత్ షాక్

అల్లవరం: దేవగుప్తం కాశివారి పేటలో విద్యుత్ పనులు నిర్వహిస్తున్న బొర్రా వంశీ శుక్రవారం రాత్రి విద్యుత్ షాక్ గురయ్యాడు. కాశివారిపేటలో విద్యుత్ సమస్య తలెత్తడంతో ఇటీవల లైన్‌మెన్‌గా బాధ్యతలు చేపట్టిన వెంకటేశ్వరరావు ఘటనా స్థలానికి వెళ్లి ప్రైవేట్ వ్యక్తి అయిన వంశీని కరెంట్ స్తంభం ఎక్కించి కరెంట్ పనులు చేస్తుండగా, 11 కేవీ వైర్లు తగలి షాక్‌కు గురయ్యాడు. దీంతో వంశీ శరీరం అంతా కాలిపోయి స్తంభం పైనుంచి పడిపోయాడు. స్థానికులు హుటాహుటిన స్పందించి 108 అంబులెన్స్‌లో అమలాపురంలోని కిమ్స్ ఆస్పత్రికి తరలించారు.

వ్యాన్‌ను ఢీకొని ఇద్దరి మృతి


సంఘటనా స్థలంలో పద్మావతి మృతదేహం


శివశ్రీను (ఫైల్)


పద్మావతి (ఫైల్)

పిఠాపురం: గొల్లప్రోలు మండలం చెందుర్తి సెంటర్లో 216 జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. పోలీసుల కథనం ప్రకారం.. అల్లూరి సీతారామరాజు మన్యం జిల్లా పాలకొండకు చెందిన జంబలి పద్మావతి (18), తొండంగి మండలం పాత పెరుమాళ్లపురానికి చెందిన కుక్కా శివశ్రీను (20)లు మోటారు సైకిల్‌పై పిఠాపురం నుంచి కత్తిపూడి వైపు వెళుతున్నారు. గొల్లప్రోలు చెందుర్తి జంక్షన్‌కు వారు చేరుకోగానే గొల్లప్రోలు మండలం తాటిపర్తి నుంచి గొల్లప్రోలు వెళుతున్న వ్యాన్ చెందుర్తి జంక్షన్ నుంచి వెళ్లేందుకు తిరుగుతోంది. అప్పటికే అక్కడికి చేరుకున్న పద్మావతి, శివశ్రీనులు ఆటోను తప్పించబోయి వ్యాన్‌ను బలంగా ఢీకొట్టారు. జంబలి పద్మావతి అక్కడికక్కడే చనిపోగా, కుక్కా శివశ్రీను ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. తాళ్లరేవు మండలం కోరంగి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మసీ కళాశాలలో పద్మావతి బీఫార్మసీ రెండో సంవత్సరం చదువుతోంది. ఎనిమిది నెలల కిందట ఈ కళాశాలలో చేరింది. మృతురాలికి తండ్రి శ్రీనివాస్, అన్నయ్య సంజయ్‌లు ఉన్నారు. వీరిద్దరూ వ్యాన్ డ్రైవర్లుగా పని చేస్తున్నారు. మృతురాలు శుక్రవారం తన తండ్రి శ్రీనివాస్‌కు ఫోన్ చేసి దసరా సెలవులకు శనివారం ఇంటికి వస్తున్నానని చెప్పింది. మృతుడు శివశ్రీను తండ్రి మణబ్బాయి, ఇద్దరు అక్కలు ఉన్నారు. శుక్రవారం రాత్రి మృతుడు కొత్త బైక్ కొనుక్కోవాలని చెప్పి తన ఫ్రెండ్ దగ్గర మోటారు సైకిల్ తీసుకున్నాడు. ఈ నేపథ్యంలో పై ఇద్దరూ బైక్‌పై వెళ్తుండగా ప్రమాదం జరిగింది. అందివచ్చిన పిల్లలు మృత్యువాత పడడంతో ఇరు కుటుంబాలు కన్నీరు మున్నీరవుతున్నాయి.

SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
RASECC, రాజమండ్రి (05254)

ఇ-వేలం అమ్మకం ప్రకటన

సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 ప్రకారం బ్యాంకు బకాయిలు రాబట్టుకొనుటకు దిగువ తెలిపిన తనఖా పెట్టిన ఆస్తి ఇ-వేలం "ఎక్కడ ఎలా వున్నది అక్కడ అలానే" మరియు "ఏది ఉంటే అది" పద్ధతి పై నిర్వహించబడుతుందని సాధారణ ప్రజలకు ఇందుమూలముగా తెలియజేయడమైనది మరియు నియమ నిబంధనలు దిగువ తెలుపబడినవి.

ఋణగ్రహీతలు/హామీదారులు: శ్రీ గురజ మనోజ్ కుమార్, తండ్రి : సత్యానందం, డి.నెం.225/1, పెదపేట, ఆత్రేయపురం, తూర్పుగోదావరి జిల్లా. హామీదారు: శ్రీ అల్లం వెంకటరావు, తండ్రి : గంగరాజు, డి.నెం.5-9, రాజావీధి, బ్యాంక్ దగ్గర, గోపాలపురం, రావులపాలెం, తూర్పుగోదావరి జిల్లా.
డిమాండ్ నోటీసు తేదీ: 19-06-2023 బకాయి మొత్తం : తేది.19-06-2023 నాటికి రూ.29,30,491/- + భవిష్య వడ్డీ, కాస్ట్స్ మరియు ఇతర ఖర్చులు మొదలగునవి.

షెడ్యూల్ ఆస్తుల వివరములు

శ్రీ గురజ మనోజ్ కుమార్, తండ్రి : సత్యానందం గారికి చెందిన ఆస్తి: తూర్పు గోదావరి జిల్లా, ఆత్రేయపురం మండలం, ఆత్రేయపురం గ్రామం, ఆత్రేయపురం ఎస్ఆర్ఓ, జిరాయితీ డ్రై ఆర్.ఎస్.నెం.37/14బి లోని ఎ.3.62 సెంట్ల మొత్తం విస్తీర్ణంలో 232 చ॥గ॥ల మధ్య విస్తీర్ణంలో ఆర్‌సిసి భవనంతో గల భూమి యావత్తు ఆస్తి. హద్దులు: తూర్పు : కళాబత్తుల వీరన్న గారి ఇల్లు – 33' 00", దక్షిణం : పల్లికొండ సత్రయ్య గారి భూమి – 63' 00", పడమర : పర విసురత్నం గారి భూమి – 33' 00", ఉత్తరం : వారా గణేయ్య గారికి చెందిన ఇంటి ఆస్తి భాగం మరియు దరఖాస్తుదారునికి చెందిన స్థలం కొంతమేర – 63' 00".

రిజర్వు ధర : రూ.35,00,000/- ధరావత్తు : రూ.3,50,000/- బిడ్ పెంపుదల : రూ.10,000/-

ఇ-వేలం తేదీ : 06-11-2024 , సమయం : ఉ॥ 11.00 గం॥ల నుండి సా॥ 04.00 గం॥ వరకు (అపరిమిత కాల పొడిగింపు 10 ని॥)

ఆస్తి తనిఖీ తేదీ: తేది: తేది.06.11.2024 లోపు ఏదైనా బ్యాంకు పనిదినములలో, కార్యాలయ పనివేళలలో ముందస్తు సమాచారం మరియు పరస్పరం అంగీకరించిన సమయం మరియు తేదీలలో.

ఇ-వేలం యొక్క నియమ నిబంధనలు

1) అమ్మకం యొక్క సవివరమైన నియమ నిబంధనల కొరకు, సెక్యూర్డ్ క్రెడిటార్స్ అయిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా యొక్క వెబ్ సైట్ : www.sbi.co.in/web/sbi-in-the-news/auction-noticesలో ఏర్పాటుచేసిన లింక్‌ను రిఫర్ చేయండి. రిజిస్ట్రేషన్, ఇఎండి, వేలం యొక్క వివరములు మొదలగు వాటి గురించి సర్వీసు ప్రొవైడర్ M/s PSB Alliance ఇ-వేలం పోర్టల్ : https://ebkray.in/eauction-psb/bidder-registration & https://www.ebkray.in & టోల్ ఫ్రీ ఫోన్ నెం.: 91 – 8291220220, Mail ID : support.ebkray@psballaince.comను సంప్రదించండి.
2) ఆస్తిని రిజిస్ట్రేషన్ చేసుకొనుటకు వర్తించే స్టాంపు డ్యూటీలు బదిలీ ఛార్జీలు, ఫీజు వగైరా మరియు చట్టపరమైన/నాన్ స్టేటటరీ బకాయిలు, పన్నులు, రేట్లు, ఎస్సెస్‌మెంట్ ఛార్జీలు, ఫీజులు వగైరా కొనుగోలు దారే భరించవలెను.
3) ఆసక్తిగల బిడ్డర్లు ఏదేని విచారణల కొరకు మరియు అమ్మకమునకు సంబంధించి తదుపరి వివరములకు అధీకృత అధికారి, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, RASECC, రాజమండ్రి (05254) చీఫ్ మేనేజర్ : 9000157939, ఇ-మెయిల్ ఐడి : sbi.05254@sbi.co.in, మరియు బ్యాంకు వారి అప్రూవ్డ్ రిసొల్యూషన్ ఏజెంట్స్ : మెస్సర్స్ డిసిఎస్ ఫైనాన్షియల్ సర్వీసెస్, రావులపాలెం / అమలాపురం, శ్రీ డి. చంద్రశేఖర్ & శ్రీ ఎస్. వెంకటేష్, సెల్ : 9866657157, 9160206033 వారిని కార్యాలయ పనివేళలలో సంప్రదించవచ్చును.
4) ఆదాయపు పన్ను చట్టం 1961లోని సెక్షన్ 194-1A ప్రకారం అమ్మకంలో భాగంగా అమ్మకం విలువ రూ.50,00,000/- (యాభై లక్షల రూపాయలు) మరియు అంతకంటే ఎక్కువ ఉన్నచో సదరు మొత్తముపై TDS @ 1% వర్తిస్తుంది. కావున సఫలీకృత బిడ్డరు/కొనుగోలుదారు అమ్మకం ధరలో 1% TDSను తగ్గించుకొని సదరు మొత్తమును ఆదాయపు పన్ను డిపార్ట్‌మెంట్ యొక్క ఫారం నెం.16-బి నందు జమచేయవలెను మరియు సదరు ఒరిజినల్ TDS సర్టిఫికెట్‌ను బ్యాంకు వారికి సమర్పించవలెను. (వ్యవసాయ భూమి కాకుండా కేవలం స్థిరాస్తి మాత్రమే వర్తించును).
గమనిక : ఆసక్తి గల బిడ్డర్లు ఇ-వేలం ముగిసేలోపు PSB Alliance నందు ప్రీ-బిడ్ ఇ.ఎమ్.డి (Pre-Bid EMD) జమ చేయవలెను. ప్రీ-బిడ్ ఇ.ఎమ్.డి మొత్తం PSB Alliance బ్యాంక్ అకౌంట్‌లో జమ అయిన సమాచారం వెబ్‌సైట్‌లో పొందుపరిచిన తరువాత మాత్రమే బిడ్డరు యొక్క "వాలెట్"లో చూపించబడుతుంది. బ్యాంకింగ్ ప్రక్రియలో అది జరుగుటకు సమయం పట్టవచ్చు, కావున బిడ్డర్లు చివరి నిముషంలో ఇబ్బందులు ఎదుర్కొనకుండా తమ ప్రీ-బిడ్ ఇ.ఎమ్.డిను సాధ్యమైనంత త్వరగా జమ చేసుకోవాలనీ సూచించటమైనది.

తేది: 05-10-2024, ప్రదేశం: రాజమహేంద్రవరం సం/- అధీకృత అధికారి, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

సాక్షి సండే క్లాసిఫైడ్స్

REAL ESTATE

■ 25 సెంట్లు భూమి 100 ఎర్రచందనం మొక్కలు కలిపి స్పాట్ రిజిస్ట్రేషన్ చేయబడును. 6.5 లక్షలు మాత్రమే. 100 గ్రా. సిల్వర్ ఉచితం. ✆ 96031 84207, 96661 66407 [B-782058]

స్థలం లీజుకు ఇవ్వబడును
ప.గో॥ జిల్లా పాలకొల్లు నుండి నరసాపురం వెళ్ళే మధ్యలో చించినాడ బైపాస్ రోడ్, దిగమర్రు బైపాస్ రోడ్‌కి ఆనుకుని 60 అడుగుల వెడల్పు, 150 అడుగుల పొడవు గల 20 సెంట్లు స్థలం పాలకొల్లు పెద్ద కాలువ, బైపాస్‌కి ఆనుకుని 3వ బిట్టు. రెస్టారెంట్‌కి, టిఫిన్ సెంటర్స్‌కి లీజుకు ఇవ్వబడును.
సంప్రదించండి :
90009 92466
73822 16469

FLAT FOR SALE

■ కాకినాడ కొండయ్యపాలెం కొత్త బ్రిడ్జి మిలటరీ రోడ్ కి దగ్గరలో 2000 Sft. ఇండివిడ్యువల్ 1st ఫ్లోర్ ఫ్లాట్ అమ్మబడును. తూర్పు ఫేసింగ్, 3 BHK. సంప్ర : సాయిబాబా – 99899 41785 [V-2690]

HOUSE FOR SALE

■ రాజమండ్రి, కోటిపల్లి బస్టాండ్ వద్ద డోర్ నెం.6-12-5/2, E/F గల 140 గజముల G+1 కమర్షియల్ కమ్ రెసిడెన్షియల్ బిల్డింగ్ అమ్మబడును. Suitable for Shops/ Offices / Hospitals. Cell : 98851 49794 [R-944]

■ కాకినాడ, APSP, ఈశ్వర్ నగర్ 2వ వీధిలో, వెస్ట్ ఫేసింగ్, 242 చ॥గ॥లు పాత బిల్డింగ్, పాత పెంకుటిల్లు కలిపి అమ్మబడును. వివరములకు సంప్ర: 99593 52149 [C-800061]

PLOT FOR SALE

■ Hyd, హయత్ నగర్, పెద్దఅంబర్‌పేట్, కోహెడ, బాటసింగారం, శ్రీమిత్ర, గ్రీన్ సిటీలో ప్లాట్లు అమ్మ/కొనబడును. నో బ్రోకర్స్. 9553973999, 6303049720 [SCA24000348]

■ కాకినాడ స్మార్ట్‌సిటీ పెనుగుదురు వంతెన దగ్గర సంధ్య ఫిజియోథెరపీ కాలేజీ ఎదురుగా 6 ఎకరాల న్యూవెంచర్‌లో KAUDA అప్రూవ్డ్ లేఅవుట్‌లో ఇండ్ల స్థలములు అమ్మకం (డ్రైనేజీ, కరెంట్, 40 అ॥ల రోడ్లు, చిల్డ్రన్స్ ప్లే ఏరియా, వాటర్ పైప్‌లైన్ సౌకర్యాలతో) ✆ : 73998 99799, 95532 44452 [R-2214]

Services

వధువు కావలెను.

■ మాల క్రిస్టియన్స్ 2nd మ్యారేజ్, గవర్నమెంట్ ఎంప్లాయి రిటైర్డ్ వయస్సు 60 సం॥లు 5.6H వరుడికి ఏ బాదర బందీ లేని వధువు కావలెను. ✆ :77949 11019 [R-1260814]

■ కాపు, 39, 5',9", ఎరుపు M.B.A. 20 కోట్ల ప్రాపర్టీ కలిగిన వరునకు అందమైన వధువు కావలెను. సంప్రదించండి ✆ 92905 57696 [B-1248674]

Wanted

■ RJYలో ఆఫీస్ పని, వంటకు ఏ బాదర బందీ లేని 45 సం॥ల హిందూ స్త్రీకి భవిష్యత్తు భరోసాతో, 10 వేలు జీతం & వసతి * స్థిరాస్తి మార్కెటింగ్ వార్కి ఆహ్వానం. ✆ : 93900 60136 [R-731]

■ Wanted Telecallers girls for Akshaya Technologies Rajahmundry. Cont: ✆ : 97010 28339, 99519 23339 [R-1260766]

■ Insurence Advisors కొరకు Interviews జరుగుచున్నవి. Qly: Min 10th Class, Age: 30+ మంచి అవకాశం. సంప్ర: ✆ : 82477 17876, 91828 24848 [R-1260765]

■ Wanted (1) Accountant with Tally (2) Pharmacist (3) Pharmacy Assistant Cont.: Jagan Ortho Care, AVA Road, Rajahmundry. ✆ : 88852 97999 [R-754]

■ M/F ఆఫీస్ అడ్మినిస్ట్రేషన్ స్టాఫ్ కావలెను. Age : 30 to 50 Years Qlf: MBA, MCA, B.Tech, Degree. Work Place : రాజమండ్రి టౌన్. Contact: 88851 12000. [NA-11133]

■ కన్సల్టెన్సీ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు, ఆయా, నర్సులు, వంట వారు, RMP&డాక్టర్స్ కావలెను.జీ: 15 వేలు -40వేలు, ఫ్రీరూం+భోజనం.HYD.8317512135 [HA-98651]

■ శివ కార్తికేయ హోంకేర్‌లో వృద్ధులను, పేషెంట్లను, పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావాలి. ఫ్రీ ఫుడ్ వసతి. జీ: 18K. ఫోన్: 9912011899 [SCA-24000293]

■ బ్యాంకింగ్ లోన్స్ DSA సంస్థలో పనిచేయుటకు సేల్స్ ఎగ్జిక్యూటీవ్స్, సేల్స్ మేనేజర్స్, టెలికాలర్స్ కావలెను. Cell: 7901545601 [HA-26569]

■ పైడా కాలేజీ పటవల యందు పని చేయుటకు అనుభవజ్ఞులైన క్యాషియర్, అకౌంటెంట్ కావలెను. వివరాలకు ఫోన్ నెం: 9848412547 [HA-04726]

■ Wanted Male Marketing Incharge Qualification Any Degree. Age Limit: 30 to 45 years. Salary upto: 25000/- Location: Rajahmundry. Contact: 92487 33370 [G-5695]

■ ప్రముఖ కంపెనీలో వర్క్ చేయుటకు స్త్రీ, పురుషులు కావలెను. Qul: 10th - డిగ్రీ, Sal: 20K - 30 K మీ అడ్రస్ వాట్సప్ చేయగలరు. వర్క్ ఫ్రం హోం అవకాశం కలదు. 8121818692. [M-1185465]

■ డేటా ఎంట్రీ ఆపరేటర్స్, జీతం 10,000/- నుండి 15,000/- వరకు Cont. శ్రీదేవి హోండా ఆథరైజ్డ్ డీలర్స్ : హోండా టూ వీలర్స్, టూటౌన్ పోలీస్ స్టేషన్ దగ్గర, మెయిన్ రోడ్, కాకినాడ. ✆ : 8143 412 349, 94909 98888 [R-74]

■ సర్వీస్ & సేల్స్ ఎడ్వయిజర్స్, జీతం:15,000/- నుండి 25,000/- వరకు Cont., శ్రీదేవి హోండా ఆథరైజ్డ్ డీలర్స్ : హోండా టూ వీలర్స్, టూటౌన్ పోలీస్ స్టేషన్ దగ్గర, మెయిన్ రోడ్, కాకినాడ. ✆ : 81434 12349, 94909 98888 [R-75]

సినిమా వార్తల కోసం లాగ్ఆన్ అవ్వండి www.sakshi.com

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు
సాక్షి క్లాసిఫైడ్స్
నాలుగు లైన్లకు రూ.: 400/-
అదనపు లైనుకు రూ.: 90/-
GST 5% Extra

రీజనల్ సెంటర్లు - రాజమండ్రి - 9010224454, 9951602906, 9010120345, 9705754205
కాకినాడ, పిఠాపురం, పెద్దాపురం: 99516 02838
తుని, జగ్గంపేట, యానాం: 90109 67896
అమలాపురం, ముమ్మిడివరం: 97053 47414
పి.గన్నవరం: 97057 49718, రాజోలు: 97053 45456
మండపేట: 99516 02941
రామచంద్రపురం: సెల్: 99516 02936

సర్వే నెం.264, ADB రోడ్, రాజానగరం. ఫోన్స్: 0883-2483010